


వంట పని ముగించి, స్నానంచేసిన సీత ముందు వరండాలోకి వచ్చేసరికి చీకటి పడింది వరండాలో లైటువేసి పడక కుర్చీలో కూర్చుని రామాయణం చేతబట్టుకుంది. ఉత్తర రామాయణంలో — రాముడు లోకులమాటలని నమ్మి సీతను వదిలేసిన ఘట్టంలోని నాలుగు పద్యాలు చదివి - అక్కడ్నే ఆగిపోయింది.

ధర్మబద్ధుడయిన రాముడి కర్తవ్యతా కర్కశత్వం. అగ్రజాజ్ఞా పాలనా నియతుడయిన లక్ష్మణస్వామి నిర్వేదం. సీతా సాధ్వి విషాద యోగం. కరుణరస ప్లావితమయిన ఘట్టం.

సీత కనులు చమర్చాయి. మరుక్షణం అవి కన్నీటి చలమలే అయ్యాయి చంపలమీద కన్నీరు చారికలు కట్టింది. మనసు తుఫానుకి అల్లకల్లోలమయిన సముద్రమే అయ్యింది. గుండెలలో అగ్నిపర్వతాలు బద్దలయి పొగలు సెగలు కక్కినట్లయింది. బాధతో ఉంగలు చుట్టుకుని మెలికలు తిరిగిన ఆలోచనలు గతంలోకి పరుగెత్తాయ్.

సుమారు ముప్ఫయి సంవత్సరాల క్రితం కొత్త కోడలుగా అత్తవారింట అడుగు పెట్టిన సీత, భవిష్యత్తుని గురించి ఎన్నో బంగారు కలలు కన్నది. భర్త రామారావు మంచివాడే! భార్యమీద అపారమయిన ప్రేమాభిమానాలు నిలుపుకున్నవాడే! కొత్త కాపురం ముచ్చటగా ఒక సంవత్సరం సాగేసరికి ఆ జీవన వీణాగానంలో అపశ్రుతులు తొంగిచూసాయి. రామారావుకి తల్లి మాట వేదవాక్కు. ఆ తల్లిది తన బిడ్డలకేగాని మరెవరికీ తల్లిని కాదనుకునే తత్త్వం. ఆ కారణంగా సీతకి ఎన్నో సమస్యలు ఎదురయ్యాయి. ఓర్పుతో సహించింది. నేర్పుతో ఆ సమస్యలను పరిష్కరించుకొనాలన్న ప్రయత్నాలు చేసింది, సీత.

ఒక మనిషి వేరొక సాటి మనిషిమీద, మంచిదో లేక చెడ్డదో అయిన అభిప్రాయం, ఏర్పడటానికి కారణాలు వుండవచ్చును ఏ కారణాలూ లేకనూ పోవచ్చును. అకారణంగానే అత్తగారు తనమీద కత్తికట్టి సాధించాలని చూస్తున్నదన్న అభిప్రాయం సీతకి కలిగింది. రానురాను ఆ సాధింపులు పరిమితులుదాటి అసహ్యమయిన విధంగా కసిగా తయారవటంతో— ఎదురుతిరిగింది సీత.

అహం ఆవేశాన్ని తెచ్చిపెట్టింది. ఆవేశం ఆలోచనని పక్కకి నెట్టజూస్తుంది. స్పర్థ క్షణక్షణానికీ పెరిగి, పెనుమంటలాగా అవటానికి అవకాశం వుంది. అత్తా కోడళ్ళ వైరం ఈదేశం యొక్క కొన్ని తరాల చరిత్రకు ప్రధానంగా రూపు దిద్దింది.

బిడ్డ కడుపున పడ్డాడు. ముసలావిడది చాదస్తం. ఏదో వాగితే వాగిందిలే, సర్దుకుపోదామన్న తత్వం సీతకి లేదు. ఏదో చిన్నపిల్ల. తెలిసీ

తెలియనితనం, ఆ పిల్లని కన్న కూతురులాగా చూసుకుని కడుపులో దాచుకుందామన్న పద్ధతి ముసలావిడకి లేదు. ఇద్దరి మధ్యా మేధకుడయిన రామారావు నలిగాడు. రానురాను అత్తా కోడళ్ళు ఇద్దరూ ఆగర్భ శత్రువుల్లాగా కాట్లాడుకోవటం ప్రారంభించారు. ఇంటి పరువు బజారుపాలయింది. ఏ రోజూ ఏ క్షణమూ ఇంట్లో శాంతి లేకుండా పోయింది.

ఆ పరిస్థితుల్లో ఒకనాడు ముసలావిడ, శాసించింది.

'అది ఈ ఇంట్లోవుంటే నేను ఒక్క క్షణం ఇక్కడ వుండను. నా దార్ని నేను పోతాను.' అని ఖండితంగా చెప్పింది.

'ఎక్కడికి వెడతావమ్మా ?'

'ఏట్లోకి, ఏట్లోదూకి ఛస్తాను.' అని బిగ్గరగా రోదించింది ముసలావిడ.

రామారావు కన్నీరుపెట్టాడు అసహాయంగా గిలగిలలాడాడు. ఎన్నో విధాల ఆమెకి నచ్చ చెప్పబోయి విఫలమయాడు.

'ఆవిడ ఈ ఇంట్లోవుంటే నేను ఈకాపురం చెయ్యలేను.' అంది ఆవేశంగా సీత.

'ఏం చేయమంటావు ?'

'ఆవిడ్ని పంపించెయ్యండి'

'ఎక్కడికి పంపించమంటావు ? ఆవిడకి నేను తప్ప ఎవరున్నారు ?'

'అదంతా నాకు తెలియదు.'

'అలా అంటే ఎలా ? కాస్త ఆలోచించు.'

'నాకు తెలియదు.'

'నోరు ముయ్యి. అలా మూర్ఖంగా మాట్లాడకు.'

'మీరే మూర్ఖంగా మాట్లాడుతున్నారు.' సీత చెంప పేలింది.

'నీ సామాను సర్దుకో. నిన్ను మీ పుట్టింట్లో దిగబెట్టి వస్తాను' అన్నాడు రామారావు. క్షణాలలో తన సామాన్లు సర్దుకుంది సీత. ఆమెను పుట్టింట్లో దిగబెట్టి వెళ్ళిన రామారావు మళ్ళీ ఆమెతో ఏ రకమయిన సంబంధమూ పెట్టుకోలేదు. ఆ తర్వాత ఇద్దరూ విడాకులు పుచ్చుకున్నారు.

ఆ తర్వాత రెండేళ్ళకే కొడుక్కి రెండో పెళ్ళిచేసి ముసలావిడ చచ్చిపోయిందని వాళ్ళద్వారా వీళ్ళద్వారా తెలిసింది.

బాబు పుట్టాడు.

వాడికి మేనమామ అండగా నిలిచాడు.

కొడుకుని చూసుకుని దుఃఖాన్ని దిగమింగుకుంది, సీత. కొడుకు కోసమే బతికింది.

బాబు పెద్దచదువులు చదివాడు. వ్యాపారం పెట్టి లక్షలు ఆర్జించాడు. మేనమామ కూతుర్ని పెళ్ళి చేసుకుని సంసారి అయ్యాడు. అన్యోన్యమయిన అనురాగం నిండిన దాంపత్యం. కొడుక్కీ, కోడలికీ సీత అంటే అపారమయిన గౌరవం. ప్రేమ.

జీవితం అనే పుస్తకానికి భర్త ముందరి అట్ట అయితే భార్య వెనుక అట్ట. అట్టలు గట్టిగా లేకపోతే పుస్తకం గాలికే చిరిగిపోయి అస్తిత్వం కోలుపోతుంది. ఆ విషయం గ్రహింపుకి వచ్చేసరికి, సీత జీవిత పుస్తకంలో చాలా కాగితాలు విడిపోయేయి.

మనస్సు వర్రి పిచ్చిది. ఆలోచనల పాతరను త్రవ్వటం మానదు. మానలేదు. బాధా తప్తమయిన అనుభూతులూ, అనుభవాలే ఎదురయినా కూడా ఆ త్రవ్వకపు పని ఆగదు. ఆ విషాదం తప్పదు. కన్నీరు వరదలా కారితేనే బరువయిన గుండెకి ఇంత ఓదార్పు.

కొడుకు పెద్ద పెద్ద పరీక్షలు ప్యాసయినప్పుడూ, కొడుకు వ్యాపారాలు చేపట్టి లక్షలు సంపాదించి దక్షత చూపినప్పుడూ, కొడుకు పెళ్ళి చేసుకుని నవ వధువుతో తలంబ్రాలు పోసుకున్నప్పుడూ —

సీతకి ఆ బాధల గాధల పాతరను త్రవ్వటం తప్పలేదు.

ఒంటరిగా మూలగదిలో చేరి కరువుదీరా విలపించక తప్పలేదు.

ఏమి శాపం ఇది ?!

గయ్యాళి అయిన ఆ రెండవ భార్య, గంపెడు పిల్లల్ని కని, కొండంత బరువుని అతని భుజాలమీదపెట్టి, అతన్ని మానసికంగా, ఆర్థికంగా, దైహికంగా నానా చిత్రహింసలకూ గురిచేసిందనీ—ఎద్దుల్లాగా పెరిగిన అప్రయోజకులయిన కొడుకులు ఒకసారి రామారావును స్తంభానికి కట్టేసి కుమలబొడవగా భయకంపితుడయిన రామారావు సంసారాన్ని వదిలేసి దేశాలుపట్టి పోయాడన్న సమాచారం అందిన తరువాత — అతన్ని గురించిన ఏ విషయమూ మరల తెలియలేదు.

ఇంత జరిగినా —

ఏ రోజూ, ఏ క్షణమూ సీత గుండెల్లో గూడు కట్టుకుని, సలుపు పెట్టటం మానలేదు, రామారావు.

'అమ్మా ! సీతమ్మ తల్లీ ! ఆకలికి సచ్చిపోతన్నాను. ఇంత అన్నంముద్ద పెట్టు తల్లీ.'

ఉలిక్కిపడి ఆలోచనల నుంచి బయట పడింది, సీత.

'అమ్మా... !'

ఆ గొంతు ఎక్కడో విన్నట్లనిపించింది.

అంతే.

చటుక్కున కుర్చీలోంచి లేచింది, సీత.

'అమ్మా... !'

ఆ పిలుపు గుండెల్లో గాలం గుచ్చి లాగగా తడబడే అడుగులతో గబగబా వీధిగుమ్మంలోకి వచ్చింది.

గేటు దగ్గర చింకిపాతలతో — అస్తిపంజరంలా వున్న ఆ ముష్టివాడి చంపలు బాగా లోతుకి పోయేయి. కాళ్ళు చేతులు పుల్లల్లాగా అయ్యేయి. నడుం వంగి వుంది.

వీధి స్తంభాలలో బిగించి వున్న దీపకాంతులలో మిలమిలా మెరుస్తూన్న అతని కళ్ళు, ఆ చూపులు, అవే... !

ఆ కళ్ళలోకే కొన్ని నిముషాలు పాటు చూస్తూ నిలబడిపోయిన సీత — ఆనందాన్ని, ఆవేశాన్ని, ఉద్వేగాన్ని, విషాదాన్ని — గుండెల్లోనే అణచిపెట్టటానికి ప్రయత్నిస్తూ

'ఏమండీ ! మీరా ?' అని కాతర స్వరంతో పలకరించింది.

అతను శిలలాగా నిలబడిపోయేడు.

'ఏమండీ ! నేనండీ. మీ సీతని. నన్ను గుర్తుపట్టలేదా ?' అంటూ అతన్ని ప్రశ్నల్లో ముంచివేస్తూ — చేతులు పట్టుకుని లోనికి తీసుకువెళ్ళింది. మంత్రముగ్ధుడిలాగా అనుసరించి వచ్చిన అతనికి —

స్నానం చేయించి —

వార్డ్ రోబ్‌లో వున్న కొడుకు పంచా, లాల్చీ ధరింపజేసి —

హాల్లో ఫాను వేసి —

అతన్ని సోఫాలో కూర్చోపెట్టి —

'రెండ్నిముషాలు కూర్చోండి. సినిమాకి వెళ్ళిన అబ్బాయీ, కోడలూ వచ్చే వేళయింది. అందరం కలిసే భోంచేద్దాం. ఈలోగా మీ కిష్టమయిన 'పాయసం' తయారుచేసి, ఒక నిముషంలో వచ్చేస్తాను.' అని చెప్పి, వంటగదిలోకి వెళ్ళి, రెట్టింపు బలంతో పనిలో పడింది, సీత.

టక్ టక్ బూట్ల చప్పుడయింది.

ఆ వెనుకే గాజుల గలగిలా, చీర గరగిరా విన్పడింది.

మల్లెపూల పరిమళం గాలిలో తేలివచ్చే లోగానే, 'అమ్మా' అన్న పిలుపూ వినవచ్చింది.

గబగబా, హాలులోకి వచ్చింది, సీత.

'బాబూ !'

'ఏమిటమ్మా ! వంట రడీయేనా ? భోంచేద్దామా ?'

'బాబూ !'

'ఏమిటమ్మా ? ఏమిటి వెతుకుతున్నావ్ ?'

'ఆయనేరి నాయనా ?'

'ఆయనా ? ఎవరమ్మా, ఆయనా ?'

ఖాళీ సోఫాల్లో వెతుకుతూవున్న, గాజు కళ్ళు నిస్తేజంగా నిస్సత్తువగా అయిపోగా శిలలాగా నిలబడిపోయింది, సీత. తూలి కూలిపోవటానికి సిద్ధంగా వున్న సీతని, కొడుకు బలమయిన చేతుల్లో నిలిపాడు. ★